

మరో మూడు రోజులు వానలు

4లో.

# జర్నలిస్ట్ వార్త

RNI NO:Title-Code:-TELTEL02102

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...








సంపుటి - 1 సంచిక - 236 శుక్రవారం 06 సెప్టెంబర్ 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




# 200 ఎకరాలలో ఏఐ సిటీ

## గ్లోబల్ సమ్మిట్ లో రేవంత్ వెల్లడి

- ఇది తమ డ్రీమ్ ప్రాజెక్ట్ అంటూ వెల్లడి
- ఐటి రంగాన్ని పరిచయం చేసేందుకు ఈ సదస్సు
- కొత్త ఆవిష్కరణలకు సంపూర్ణ ప్రొత్సాహం
- ఫోర్త్ సిటీలో అందరికి అవకాశాలు
- దేశానికే మార్గదర్శకంగా ఫోర్త్ సిటీ నిర్మాణం

ఎన్నికల ముందు డిక్లరేషన్ లో చెప్పినట్టే AI కి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో రెండు రోజుల పాటు జరిగే AI గ్లోబల్ సమ్మిట్ ను రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తో కలిసి ప్రారంభించారు. కాగా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అందరికీ అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ

# భారీ ఎన్‌కౌంటర్..

## ఆరుగురు మావోయిస్టులు మృతి

- మృతుల్లో దళ కమాండర్ లచ్చన్న
- ఇద్దరు పోలీసులకు స్వల్ప గాయాలు
- మావోయిస్టులకు మరో దెబ్బ
- పెద్ద ఎత్తున మారణాయుధాల స్వాధీనం



మణుగూరు: సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త): ప్రశాంతంగా ఉన్న పినపాక ఏజెన్సీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గిరిజల గ్రామాల్లో తుపాకుల మోత తో గ్రామస్థులు భయభ్రాంతులకు గురయ్యారు. గురువారం ఉదయం కరకగూడెం మండల పరిధిలోని రఘునాథపాలెం గ్రామ శివారులు మావోయిస్టులకు, పోలీసులకు జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతి చెందిన వారిని లచ్చన్న దళ సభ్యులుగా పోలీసులు నిర్ధారించారు. గురువారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు విలేకరులతో మాట్లాడుతూ గత కొంతకాలంగా మణుగూరు ఏరియాలో నిషేధిత మావోయిస్టుకు చెందిన లచ్చన్న దళం సంచరిస్తుందన్న సమాచారంతో గురువారం ఉదయం కరకగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో మోతె అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు నిషేధిత సిపిఐ మావోయిస్టు ధళ సభ్యులు ఎదురుపడి పోలీసులపై కాల్పులు జరిపారని అన్నారు. ఆనంతరం పోలీసులు ఎదురుకాల్పులు జరపగా ఎదురుకాల్పుల్లో భ ద్రాద్రి కొత్తగూడెం- అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటికి చెందిన ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారని తెలిపారు. అదేవిధంగా ఇద్దరు పోలీసులకు స్వల్ప గాయాలు జరిగినట్లు తెలిపారు.

మిగతా 2లో.

## రాష్ట్రంలో శాంతి లేదు ..

# భద్రత లేదు

## రేవంత్ పై కెటిఆర్ ధ్వజం

- రోజు రోజుకూ దుర్మార్గులు రెచ్చిపోతున్నారు
- జైనూర్ లాంటి ఘటనలు బాధాకరం
- బాధిత మహిళకు న్యాయం జరగాలి
- ట్విట్టర్ వేదికగా ఆవేదన వ్యక్తం చేసిన కేటీఆర్



## ప్రభుత్వ పాఠశాలలకు

# ఉచిత విద్యుత్

మరో ఆరు వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి త్వరలో డీఎస్సీ వేయబోతున్నట్టు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను రూపొందిస్తున్నట్టు తెలిపారు.

- 6,000 పోస్టులతో మరో డీఎస్సీ: భట్టి విక్రమార్క
- పది రోజుల్లో డీఎస్సీ ఫలితాలు( 150 మంది టీచర్లకు పురస్కారం
- గురుపూజోత్సవ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్:** సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త):రాష్ట్రంలోని 27,862 ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్‌ను అందించేందుకు జీవో జారీ చేసినట్టు వెల్లడించారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురువారం రవీంద్రభారతిలో గురుపూజ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భట్టి మాట్లాడుతూ, ప్రగతిశీల సమాజ నిర్మాణంలో టీచర్లది కీలకపాత్ర అని కొనియాడారు. 2007లో ఆంగ్ల మాధ్యమ బోధనపై విమర్శలు వచ్చినా, టీచర్లు సహకరించారని భట్టి గుర్తు చేశారు. ప్రపంచంతో పోటీ పడేలా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. విద్యారంగానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. 11,062 టీచర్ పోస్టుల భర్తీ కోసం ఇటీవల నిర్వహించిన డీఎస్సీ పరీక్ష ఫలితాలను మరో పదిరోజుల్లో వెల్లడించనున్నట్టు తెలిపారు.




మిగతా 2లో.



# జైనూరు ఘటన..

## ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ

- పోలీసు ఉన్నతాధికారుల నిర్ణయం..
- జైనూరులోనే అదనపు డీజీ, ఐజీ మకాం
- మరో 2 రోజులు ఇంటర్నెట్ బంద్,
- 144 సెక్షన్ కొనసాగింపు

# స్థానికత ప్రకారమే సీట్లు

## హైకోర్టులో ప్రభుత్వానికి ఊరట

సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో 33 వ్యవహారంలో ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. జీవో 33ని సవాల్ చేస్తూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలవ్వడంతో, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ విషయంలో ప్రభుత్వ ఆలోచన సరైనదేనని వ్యాఖ్యానించిన కోర్టు.. సీట్ల కేటాయింపులో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. జీవో నంబరు 33లో స్థానికులు ఎవరనే అంశంపై సరైన మార్గనిర్దేశకాలు లేవని ధర్మాసనం అభిప్రాయపడింది. స్థానికత నిర్ధరణకు సరైన మార్గదర్శకాలు రూపొందించాలని




ప్రభుత్వానికి ఆదేశించింది. పిటిషనర్ల స్థానికతను నిర్ధారించుకున్నాకే వారి దరఖాస్తులను పరిగణలోకి తీసుకోవాలని సూచించింది.

పిటిషన్ దాఖలు చేసిన విద్యార్థులు తెలంగాణ శాశ్వత నివాసులేనా కాదా అన్నది పరిశీలించాలని హైకోర్టు సూచించింది. ఇందుకోసం ప్రస్తుతం మార్గదర్శకాలు లేనందున కొత్తగా రూపొందించి, అమలు చేయాలని కాళోజీ వర్సిటీని హైకోర్టు ఆదేశించింది.

# 'మల్లన్నసాగర్'పై 'ఎన్జీటీ' విచారణ

హైదరాబాద్ సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త): మల్లన్నసాగర్ ప్రాజెక్టుపై ఢిల్లీలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ) ప్రధాన ధర్మాసనం విచారణ చేపట్టింది. 'ఏ అధ్యయనమూ చేయలేదు. ఎలాంటి ఇన్వెస్టిగేషన్ జరపలేదు. తొందరపాటుతో డ్రాయింగ్స్‌ను ఆమోదించి భూకంప జోన్‌లో మల్లన్నసాగర్ ప్రాజెక్టును నిర్మించారంటూ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా(కాగ్) నివేదిక సమర్పించింది'అంటూ ఓ ఆంగ్ల పత్రికలో వచ్చిన వార్తను ఎన్జీటీ సుమోటోగా పరిగణించింది.

నీటిపారుదల శాఖ ఈఎన్సీ, జిల్లా డిప్యూటీ కలెక్టర్, కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణమార్పుల మంత్రిత్వ శాఖ(ఎంఓఈఎఫ్) కార్యద ర్శిని ప్రతివాదులుగా చేర్చుతూ నోటీసులు జారీ చేసింది

మిగతా 3లో.



# తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ దిలీప్ అరెస్ట్...

- తీవ్రంగా స్పందించిన కేటీఆర్
- రెచ్చగొట్టే విధంగా ప్రచారం చేస్తున్నారని అరెస్ట్ చేసిన సీసీఎస్ పోలీసులు
- దిలీప్ అరెస్ట్‌ను ఖండించిన బీఆర్ఎస్
- ప్రజాపాలన అంటే ప్రశ్నించే గొంతు నొక్కడమేనా? అని కేటీఆర్ నిలదీత

# రాష్ట్రంలో శాంతి లేదు .. భద్రత లేదు

హైదరాబాద్: సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాష్ట్రానికి పూర్తిస్థాయి హోం మంత్రి లేకపోవడం వల్లే శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని, జైనూర్ లాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ఈ మేరకు జైనూర్ ఘటనపై కేటీఆర్ ట్వీట్ చేశారు.
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై జరిగిన లైంగికదాడి ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అక్కడ జరిగిన హింసాత్మక చర్యల్లో అనేక ఆస్తుల విధ్వంసం జరగడం దురదృష్టకరం. బాధిత మహిళకు కేవలం లక్ష రూపాయల పరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం యత్నించడం దుర్మార్గం. ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతున్నాయని ముందస్తు సమాచారం ఉన్నా వాటిని నివారించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని కేటీఆర్ మండిపడ్డారు.
జైనూర్‌లో తక్షణమే శాంతి నెలకొనేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, బాధిత మహిళకు మెరుగైన వైద్యం అందించాలని కేటీఆర్ అన్నారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూడాలని, అల్లర్లలో ఇళ్లు, షాపులు కోల్పోయినవారికి సాయంగా నిలవాలన్నారు. పూర్తి స్థాయి హోం మంత్రి లేకుండానే తొమ్మిది నెలలుగా రాష్ట్రాన్ని నడపడం వల్లనే తరచూ ఇటువంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు.

# తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ దిలీప్ అరెస్ట్...

హైదరాబాద్ సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌ను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. దిలీప్‌ను సీసీఎస్ పోలీసులు విచారిస్తున్నారు.
అయితే, తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న తప్పులను సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించినందుకు ఆయనను అక్రమంగా అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ ఎక్స్ వేదికగా పేర్కొంది. ఆయన అరెస్టును బీఆర్ఎస్ నేతలు ఖండిస్తూ ట్వీట్లు చేస్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా దిలీప్ అరెస్టును తీవ్రంగా ఖండించారు.ప్రజా పాలన అంటే ప్రశ్నించే వాళ్ల గొంతు నొక్కడమేనా? అని కేటీఆర్ నిలదీశారు. దిలీప్‌ను అక్రమంగా అదుపులోకి తీసుసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అసమర్థతను, చేతగానితనాన్ని దిలీప్ కొంతకాలంగా ప్రశ్నించటాన్ని రేవంత్ సర్కార్ తట్టుకోలేకపోతోందన్నారు. కొన్ని రోజుల క్రితం కూడా తప్పుడు కేసులో ఇబ్బంది పెట్టాలని ప్రయత్నిస్తే హైకోర్టు చీవాట్లు పెట్టినా బుద్ధి రాలేదన్నారు.ఎలాగైనా దిలీప్ గొంతు నొక్కాలన్న ఉద్దేశంతో మరోసారి అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. కనీస సమాచారం ఇవ్వకుండా ఏ కేసులో అదుపులోకి తీసుకుంటున్నారో కూడా చెప్పకుండా అరెస్ట్ చేశారని విమర్శించారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో పాలన కొనసాగించవచ్చనుకుంటే అది మీ భ్రమే అవుతుందని హెచ్చరించారు.ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అక్రమ నిర్బంధాలు చేసినా ప్రభుత్వాన్ని ప్రశ్నించే వాళ్లు మరింతమంది పుట్టుకు వస్తారన్నారు. అక్రమంగా అదుపులోకి తీసుకున్న దిలీప్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తొమ్మిది నెలలుగా తెలంగాణలో వాక్ స్వాతంత్రం లేదని, నిరంకుశ పాలన సాగుతోందని ధ్వజమెత్తారు.

# 82 మందికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం




ఢిల్లీ సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త):
దజాతీయ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 82 మందికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో అవార్డులు ప్రదానం చేశారు. విద్యా బోధనలో నాణ్యత పెంచడమే కాక, విద్యార్థుల జీవితాలను మెరుగుపర్చేందుకు వీరు చేసిన విశిష్ట సేవలకు గుర్తుగా ఈ అవార్డులు లభించాయి. విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంపొందించడం, ఇంటిదగ్గరే వారి చదువులు పర్యవేక్షించడం, బాల్యవివాహాలను నిరోధించడం, వ్యర్థాలతో తిరిగి ఉపయోగపడే వస్తువులు చేయడం, అద్భుతమైనఆటోమేటిక్ స్కూల్ బెల్ తయారీ తదితర ప్రత్యేకతలు చూపించిన ఉపాధ్యాయులు అవార్డు గ్రహీతల్లో ఉన్నారు. పాఠశాల విద్య, అక్షరాస్యత, విద్యామంత్రిత్వశాఖ ఈ ఏడాది (2024) జాతీయ అవార్డుల కోసం 28 రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాలు, ఆరు సంస్థల నుంచి 50 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. ఈ 50 మందిలో 34 మంది పురుషులు కాగా, 16 మంది మహిళలు, ఇద్దరు దివ్యాంగులు, మరొకరు సిడబ్ల్యుఎస్ఎన్ లో పనిచేస్తున్నారు. దీంతో పాటు హయ్యర్ ఎడ్యుకేషన్‌కు చెందిన 16 మంది, మినిస్ట్రీ ఆఫ్‌స్కిల్ డెవలప్‌మెంట్ నుంచి మరో 16 మందిని అవార్డుల కోసం ఎంపిక చేసినట్టు విద్యామంత్రిత్వశాఖ సీనియర్ అధికారి తెలిపారు. గత ఏడాది హయ్యర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌ల నుంచి, పాలిటెక్నిక్స్ నుంచి ఈ విధంగా రెండు కేటగిరీల నుంచి అవార్డు గ్రహీతలను ఎంపిక చేయాలని నిర్ణయించారు. అంతకు ముందు ఈ అవార్డులు స్కూల్ టీచర్లకే పరిమితం అయ్యేవి .

# 9 నెలల రేవంత్‌రెడ్డి పాలనలో విద్యా వ్యవస్థ ధ్వంసమైంది: హరీశ్ రావు



హైదరాబాద్ సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త):
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాధాన్యతలో విద్య లేకపోవడం శోచనీయమని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన గురుపూజోత్సవానికి హాజరయ్యే తీరిక లేదా..? అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. విద్యాశాఖ పట్ల సిఎం చిత్తశుద్ధికి, ప్రాధాన్యతకు ఇది మరో నిదర్శనమని వ్యాఖ్యానించారు. 9 నెలల రేవంత్‌రెడ్డి పాలనలో విద్యా వ్యవస్థ ధ్వంసమైందని పేర్కొన్నారు. టీచర్లు లేక పాఠశాలలు మూసేస్తున్నారని, పురుగుల అన్నం, గొడ్డుకారం తినలేక విద్యార్థులు ఏడుస్తున్నారని, ఫుడ్ పాయిజన్, పాము కాట్లు, కుక్క కాట్లు, ఎలుక కాట్లతో రోదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గురుకులాల ఖ్యాతిని రోజు రోజుకి దిగజార్చుతున్నారని మండిపడ్డారు. పాఠాలు చెప్పే ఉపాధ్యాయులను నిర్ధాక్షిణ్యంగా తొలగిస్తున్నారని, తరగతి గదుల్లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డెక్కి నిరసనలు తెలియజేస్తున్నారని అన్నారు. తమ పిల్లల భవిష్యత్తు గురించి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఉన్న విద్యా వ్యవస్థను సక్రమంగా నిర్వహించరు కానీ సమీకృత గురుకులాలు, విద్యా కమిషన్ అంటూ భ్రమలు కల్పిస్తున్నారని విమర్శించారు. మీ నాయకత్వంలో పతనమవుతున్న విద్యా వ్యవస్థ గురించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఏం సమాధానం చెబుతారు రేవంత్ రెడ్డి..? అని హరీశ్‌రావు అడిగారు.

# 200 ఎకరాలలో ఏఐ సిటీ

హైదరాబాద్ సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త):
ప్రారంభ సందర్భంగా %ూ×% రోడ్ మ్యాప్ ను ముఖ్యమంత్రి విడుదల చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, ఐటీ రంగంలో ప్రపంచంలోని ప్రతి ఒక్కరి దృష్టిని ఆకర్షించేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్మించనున్న నాలుగో నగరంలో 200 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిష్టాత్మకంగా ఏఐ సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రైల్ ఇంజిన్, ఫోటో కెమెరా మొదలు కొని ఇప్పుడు %ూ×% కి వచ్చామన్నారు. క్రమంగా టెక్నాలజీ పెరుగుతోందన్నారు.
ఎన్నికల ముందు డిక్లరేషన్ లో చెప్పినట్టే %ూ×% కి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ఇతర పరిజ్ఞానం కి చెందిన వారికి అవకాశాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి అందరికి అవకాశం ఇస్తున్నామని తెలిపారు. సాంకేతికత, ఆవిష్కరణ లేకుండా సమాజంలో ఏ మార్పు జరగదన్నారు. మొదటి రైలు, ఇంజిన్ ఆవిష్కరణ తరువాత ప్రపంచం పూర్తిగా మారిందన్నారు. విమానం ఆవిష్కరణతో ప్రపంచ స్వరూపమే మారిపోయిందన్నారు. ఇదే క్రమంలో కరెంటు, బల్బు, టీవీ, కెమెరా, కంప్యూటర్ %-% ఇవన్నీ ప్రపంచ గతిని మార్చడంలో కీలక పాత్ర పోషించాయన్నారు. టెలివిజన్, కంప్యూటర్లు, ఇంటర్నెట్, మొబైల్ ఫోన్ చూడటం మన తరం చేసుకున్న అదృష్టం అన్నారు. ఇవాళ ప్రపంచ సాంకేతికరంగంలో వచ్చిన అత్యుత్తమ ఆవిష్కరణ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అన్నారు.
కొత్త టెక్నాలజీ వచ్చినప్పుడల్లా కొంత భయం నెలకొంటుందని తెలిపారు. అది మన జీవితాన్ని ఎలా మెరుగుపరుస్తుంది.. అదే సమయంలో ఉద్యోగాలు పోతాయా భయం ఉండటం సహజం అన్నారు రేవంత్. దేశ చరిత్రను పరిశీలిస్తే.. గతంలో వచ్చిన పారిశ్రామిక విప్లవాన్ని సరిగ్గా అనుసరించలేకపోయామని తెలిపారు. భారతదేశ భవిష్యత్తు గురించి మనం ఆలోచిస్తే.. హైదరాబాద్ సిటీలా మరీ సిటీ పరిశ్రమల ఏర్పాటుకు సంపూర్ణంగా సిద్ధంగా లేదన్నారు.మా చిత్తశుద్ధిని శంకిచవద్దు.. ఇందుకు సంబంధించిన సవాళ్ళను స్వీకరించడమే కాదు%ొ% భవిష్యత్తును సృష్టిస్తామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై తమ చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం చాలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ రంగంలో మన భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలనుకుంటున్నామన్నారు. తెలంగాణ %ూ×% మిషన్, లేదా %చీూూూజూవీ% భాగస్వామ్యంతో %ు-ూ×వీ% తెలంగాణలో %ూ×% ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేయడంలో తమకు సహకరిస్తాయన్నారు ముఖ్యమంత్రి. ఇండస్ట్రీ నిపుణులతో కలిసి ఆవిష్కరణలను ప్రభుత్వం ముందుకు తీసుకెళుతుందన్నారు. హైదరాబాద్ ను %ూ×% హబ్ గా తీర్చిదిద్దబోతున్నామనేందుకు ఈ సదస్సు నిదర్శనం అన్నారు. సిటీ ఆఫ్ ది ఫ్యూచర్‌కి మీ అందరికి స్వాగతం అన్నారు. మనమందరం కలిసి ఫ్యూచర్ సిటీని ఒక గొప్ప %ూ×% హబ్ గా తీర్చిదిద్దే సంకల్పంతో మీరంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# భారీ ఎన్‌కౌంటర్.. ఆరుగురు మావోయిస్టులు మృతి

**(మొదటి పేజి తరువాయి)**
గాయపడిన పోలీసులను భద్రాచలం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతి చెందిన మావోయిస్టుల్లో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారని మృతుల్లో మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం %-% అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటి కార్యదర్శి లచ్చన్న దంపతులు ఉన్నారు. మృతి చెందిన వారి వివరాలు 1.లచ్చన్న అలియాస్, వీరయ్య, 2. శుక్రాం, 3.తులసీ, 4.దుర్గేష్, 5.రాము, 6.కోసి ఉన్నట్లు సమాచారం. సంఘటనా స్థలంలో ఏకే 47 ఆయుధాలు 02, ఎస్-ఎల్ఆర్ 01, 303 రైపిల్ 01, పిస్టల్ 01, మ్యాగ్జిన్‌లతో పాటు కిట్ బ్యాగులు ఇతర సామగ్రి స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఎదురు కాల్పుల్లో మరో మావోయిస్టు పారిపోయాడనే సమాచారంతో స్పెషల్ పార్టీ పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలు మావోయిస్టులకు కంచుకోటలుగా ఉండేవి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టుల ఏరివేత పటిష్టంగా అమలు చేయడంతో ఈ ప్రాంతాల్లో మావోయిస్టులు తమ ఉనికిని కోల్పోయి, పొ రుగు రాష్ట్రమైన చత్తీస్‌గఢ్‌కు తమ కార్యకలాపాలను విస్తరించారు. తెలంగాణ రాష్ట్రంలో పట్టు సాధించాలనే లక్షంతో చత్తీస్‌గఢ్‌కు నుంచి భద్రాద్రి, ములుగు జిల్లాలో భద్రాద్రి కొత్తగూడెం- అల్లూరి సీతరామరాజు డివిజన్ కమిటీ లచ్చన్న అలియాస్ వీరయ్య దళం సంచరిస్తుందనే సమాచారం అందినట్లు తెలుస్తుంది.గత నెల రోజులుగా స్పెషల్ పార్టీ పోలీసులు అడవులను జల్లెడ పడుతున్నాయి. జిల్లాలో భారీ వర్షాలు, వరదల కారణంగా ఛత్తీస్‌గడ్‌కు మావోయిస్టులు వెళ్లలేరనే లక్షంతో గురువారం కరకగూడెం మండల పరిధిలో లచ్చన్న దళం ఉందన్న సమాచారంతో భారీ సంఖ్యలో పోలీసులు కూం బింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడ్డారు. పక్కా ప్లాన్‌తో ఉన్న పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల కారణంగా మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మావోయిస్టు పార్టీ అగ్రనాయకులు జగన్ మృతి చెంది 24గ ంటల కాకముందే మరో అగ్రనేత లచ్చన్న మృతి చెందడం మావోయిస్టులకు ఎదురుదెబ్బగానే భావించాలి.రఘునాథపాలెం ఎన్‌కౌంటర్ విప్లవ ద్రోహుల వల్ల జరిగిందని మావోయిస్టు పార్టీ పత్రిక ప్రకటనను కేంద్ర కమిటీ సభ్యులు ఆజాద్ పేరుతో విడుదల చేసింది. రఘునాథపాలెం ఎన్‌కౌంటర్‌లో తమ పార్టీ డివిజన్ సభ్యులు కామ్రేడ్ లచ్చన్నతో పాటు మరో 5గురు సభ్యులు మృతి చెందారని తెలిపారు. త్యాగాలు తమ పార్టీకి కొత్త కాదని, ఎన్‌కౌంటర్‌లకు తాము భయపడే ప్రసక్తే లేదని తెలిపారు. పోలీసులు జరిగిన ఎన్‌కౌంటర్‌కు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, తగిన మూల్యం చెల్లించుకుంటామని తెలిపారు. మృతి చెందిన మావోయిస్టులకు సంఘీభావంగా 9న బంద్ పాటిస్తున్నామని, ప్రజలు, వ్యాపార వర్గాలు బంద్‌కు సహకరించాలని లేఖలో పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్

**(మొదటి పేజి తరువాయి)**
667 కోట్లతో ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, వాటి నిర్వహణ బాధ్యతను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించామణి చెప్పారు. పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను అందించడానికి నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశామని, 63 ఐటీఐ కాలేజీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని భట్టి తెలిపారు. విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.300 కోట్లు వెచ్చించామని, ఉస్మానియా వర్సిటీకి రూ.వంద కోట్లు కేటాయించామని వివరించారు. విద్యారంగంలో సమూల మార్పుకే విద్యా కమిషన్ ఏర్పాటు చేశామన్నారు.ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు పూర్తి రీయింబర్స్‌మెంట్..ప్రభుత్వ స్కూళ్లలో చదివిన విద్యార్థులకు విదేశీ విద్య, ఉన్నత విద్యకు




సంబంధించి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేందుకు ఆలోచిస్తున్నట్టు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని, టీచర్లు కూడా స్కూళ్లలో విద్యార్థుల ప్రవేశాలు పెంచేందుకు కృషిచేయాలని సూచించారు. అలాగే విద్యారంగంలో తీసుకు వస్తున్న సంస్కరణలకు సహకారం అందించాలని కోరారు.ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, అణగారిన వర్గాల కొత్తతరం ఇప్పుడు ప్రభుత్వ స్కూళ్లకు వస్తోందని, వారిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత టీచర్లపై ఉందని అన్నారు. మారుతున్న కాలంతో పాటు ఉపాధ్యాయులూ అప్‌గ్రేడ్ కావాల్సిన అవసరం ఉందని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన, పాఠశాల విద్య డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఇంటర్‌బోర్డ్ కార్యదర్శి శృతి ఓజా, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్‌కే మహమూద్, ప్రొఫెసర్ వెంకటరమణ, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఎమ్మెల్సీలు కూర రఘోత్తమ్‌రెడ్డి, ఎ.నర్సిరెడ్డి, ఎ.వెంకటనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందించిన 150 మంది అధ్యాపకులను మంత్రి పొన్నం ప్రభాకర్ సత్కరించారు.

# జైనూరు ఘటన.. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ

: ఆసిఫాబాద్ సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త)::
ఆసిఫాబాద్ జిల్లా జైనూరులో గిరిజన మహిళపై ఆటో డ్రైవర్ అత్యాచార యత్నం కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయించారు.
ఇప్పటికే నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. బాధితురాలికి గాంధీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కేసు తీవ్రత దృష్ట్యా డీఎస్పీ నేతృత్వంలోని ప్రత్యేక బృందం ఈ కేసును దర్యాప్తు చేస్తోంది. మరోవైపు, బుధవారం జైనూరులో ఇరు వర్గాల మధ్య ఘర్షణ నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.
అల్లర్లలో పాల్గొన్న ఇరు వర్గాల వ్యక్తులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. జైనూరుతోపాటు ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ మండలాల్లోనూ 144 సెక్షన్ విధించారు. పికెటింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. జైనూరు నుంచి ఆసిఫాబాద్, ఉట్నూరు వైపు ఎవరూ వెళ్లకుండా, జైనూరులో ఇళ్ల నుంచి బయటికి రాకుండా ఆంక్షలను విధించారు. సోషల్ మీడియాను కట్టడి చేసేందుకు మరో రెండు రోజులు ఇంటర్నెట్ సేవలు నిలిపివేయాలని నిర్ణయించారు. మరోవైపు.. అదనపు డీజీపీ (శాంతి,



భద్రతలు) మహేశ్ భగవత్, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి జైనూర్‌లోనే మకాం వేశారు.
మహేశ్ భగవత్ ఇరువర్గాల పెద్దలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఆదివాసీ మహిళపై దాడి జరగడం బా?ధాకరమని, ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని కోరారు.అల్లర్లలో జరిగిన ఆస్తి నష్టంపై నివేదిక అందించేందుకు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించినట్లు తెలిపారు. కాగా, జైనూరు ఘటనను నిరసిస్తూ కెరమెరి, వాంకిడి, సిర్పూర్(యు), తిర్యాణి మండలాల్లోనూ ఆదివాసీలు బంద్‌కు పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి, కాసిపేటలో నిరసన తెలిపారు. జైనూరు వెళ్లేందుకు యత్నించిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, సిర్పూరు ఎమ్మెల్యే హరీశ్‌బాబును పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు.

**మంత్రి సీతక్కతో బీజేపీ నేతల వాగ్వాదం**

గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని మంత్రి సీతక్క రెండోసారి పరామర్శించేందుకు వచ్చారు. బాధితురాలి కుటుంబీకులతో మాట్లాడి.. వైద్యం, ఇతర ఖర్చుల నిమిత్తం రూ.లక్ష చెక్కును అందజేశారు. కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుతుందని, ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. మం త్రి తిరిగి వెళ్తున్న సమయంలో ఆమె కారును బీజేపీ మహిళా నేత శిల్పారెడ్డి, కార్యకర్తలు అడ్డుకునేందుకు ప్రయత్నించి వాగ్వాదానికి దిగారు.దీంతో పోలీసులు ఎంసీహెచ్ భవనం ముందు నుంచి మంత్రిని బయటికి పంపించారు. సీతక్క స్పందిస్తూ.. బీజేపీ నేతలు లేనిపోని ఆరోపణలు చేస్తూ, విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. జైనూరు ఘటన నిందితులను రక్షించేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం హేయమని ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ విమర్శించారు. జైనూరు ఘటనను విశ్వ హిందూపరిషత్ ఖండించింది. స్థానిక పోలీసు యంత్రాంగం నిందితులకే వత్తాసు పలకడం బాధాకరమని మండిపడింది.

జర్నలిస్ట్ వార్త

శుక్రవారం 06 సెప్టెంబర్ 2024











## వరంగల్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో

# గురుపూజ దినోత్సవం

**- ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులకు సన్మానం**

**- ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రజా ప్రతినిధులు - ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులు**











**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త):** విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అధ్యక్షతన గురువారం డాక్టర్ సర్వేపెల్లి రాధాకృష్ణ పుట్టిన రోజు సంధర్భంగా గురుపూజోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ ఎం.పి కడియం కావ్య, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, వర్ధన్నపేట శాసన సభ్యులు కె.ఆర్ నాగరాజు తోపాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి, అదనపు కలెక్టర్ జి. సంధ్య రాణి, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్ పాల్గొని ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ పిల్లలకు, తల్లిదండ్రుల తర్వాత గురువులే బాధ్యత వహించాలని అన్నారు. చిన్నతనం నుండే పిల్లల పెద్దయ్యాకా ఏమి అవ్వాలో అన్న ఆలోచనను కల్పించి, వారిని మంచి మార్గంలో నడిపించేలా చూడాలని అన్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు భరతనాట్యం, యోగాసనాలు వేసి వారి ప్రతిభను ప్రదర్శించారు. ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన మొదటిసారిగా 30 మంది టీచర్లకు పదోన్నతి కల్పించిన ఘనత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారని తెలిపారు. పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ, కొన్ని ఇబ్బందులు పడుతున్నాయని వాటిని అధిగమించుటకు యంత్రాంగం కృషిచేసి, పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సూచించారు. వర్ధన్నపేట శాసనసభ్యులు కే ఆర్ నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన మొట్టమొదటి సారి శాసనసభలు 317 జిఓపై మాట్లాడం జరిగిందని గుర్తు చేశారు. జిల్లాలో వివిధ గ్రామాలలో డ్రగ్ మాఫియా వ్యాప్తి చెందుతుందని, దానిని అధిగమించే విధంగా ఉపాద్యాయులు విద్యార్థులను పట్ల తల్లిదండ్రుల కంటే ఎక్కువ బాధ్యత వహించవలసి ఉంటుందని గుర్తు చేశారు. పిల్లలకు చదువుతో పాటు వ్యాయామం ముఖ్యమని అన్నారు. విద్యార్థులను ప్రతిభవంతులుగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా టీచర్లకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 59 మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులుగా గుర్తింపు పొందిన ప్రముఖులచే ప్రతిభ పురస్కారాలు అందించారు. ఉపాధ్యాయుల దినోత్సవం వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థినీ, విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ, జిల్లా సైన్స్ టీచర్ శ్రీనివాస్, తదితరులు జిల్లాలో గుర్తింపు పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాలను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి

**- వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి**





వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త): సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాలను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. గురువారం రాయపర్తి మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో గదులను, స్టాక్ రూమ్ ను, వంటలను పరిశీలించారు. అనంతరం విద్యా బోధన, హాస్టల్ పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి వసతి గృహాలను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని, వసతి గృహాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. టాయిలెట్స్ పరిశీలించి, వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వారి వెంట హాస్టల్ వార్డెన్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తనిఖీ

**- వర్షకాల ప్రభావం వ్యాదులు వ్యాపించే అవకాశం**

**- వ్యాధిగ్రహిస్తులకు సరైన వైద్య సేవలు అందించాలి**

**- డాక్టర్లకు, సిబ్బందికి తగు సలహాలు, సూచనలు**

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. వెంకటరమణ**





వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. వెంకటరమణ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గురువారం విస్తృతంగా పర్యటించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు దుగ్గొండి, నల్లబెల్లి, బానోజీపేట, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, నాచనపల్లి బానోజీపేట వన్, నర్సంపేటలోని డెంగ్యూ కేస్ ఏరియాలలో పర్యటించారు. వైద్యాధికారులకు సిబ్బందికి తగు సూచనలు అందించారు. వర్షాకాల ప్రభావం వలన అంటువ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికన్ గునియా, మెదడువాపు, రక్త విరోచనాలు, నీళ్ల విరోచనాలు, జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశము ఎక్కువగా ఉందన్నారు. అందువల్ల ఉద్యోగులు ఇంటింటి సర్వే చేసి, జరగ్రస్తులను గుర్తించి, పరీక్షలు చేసి తగు చికిత్సలు అందించి, ఎవరికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాకుండా చూడాలని, ఉద్యోగ సమయమంతా ప్రజలు స్వచ్ఛందంగా మురికినీటిని, నిలువనీటిని తొలగించి, దోమలు పుట్టకుండా, కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేడి చేసిన నీటిని కాచి వడపోసిన తర్వాత తాగాలని, వేడి ఆహార పదార్థాలను మాత్రమే భుజించాలని తెలిపారు. డెంగ్యూ పాజిటివ్ వచ్చిన ఏరియాలలో వైద్య సిబ్బంది, ఎంపీడీవో సహకారంతో గ్రామపంచాయతీ సిబ్బందిచే మురికి కాలువలు శుభ్రం చేయించాలన్నారు. ఆంటీ లార్వల్ స్ప్రింగ్, ఫాగింగ్ చేయించాలని తెలిపారు. గ్రామాలలో, తండాలలో, తప్పనిసరిగా ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ప్రజలకు వ్యాధులకు వ్యాపించకుండా అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజు గర్భిణీ స్త్రీలను పర్యవేక్షిస్తూ, వారిని డెలివరీ కొరకు సురక్షితమైన ప్రభుత్వ దావకానలకు పంపించాలని కోరారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, డిప్యూటీ డెమో సిబ్బంది పాల్గొన్నారు.



# జైనూరులో అసలేం జరిగింది ?



జైనూరు సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త): జైనూరు ఇప్పుడు దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతోంది. అసలు అక్కడేం జరిగిందన్నది కూడా చాలా మందికి తెలిదు. ఓ ఆదివాసి మహిళపై ముస్లిం ఆటో డ్రైవర్ హత్యాచార యత్నం చేయబోయాడన్నది మాత్రం హైలెట్ అవుతోంది. ఇక్కడ మతాల ప్రస్తావన రావడంతో ఘర్షణలకు దారి తీశాయి. ఎంతగా అంటే కర్ఫ్యూలు విధించాల్సి వస్తోంది. జైనూరులో ఐదు రోజుల కిందట ఓ ఆదివాసీ మహిళ తన గ్రామానికి వెళ్లేందుకు బస్టాండ్ వద్ద ఆటో ఎక్కింది. అయితే కొంత దూరం వెళ్లిన తర్వాత ఆటోలో పెనుగులాట చోటు చేసుకుంది. దాంతో డ్రైవర్ ఆమెను పక్కకు లాగి పడేసి వెళ్లిపోయాడు. ఆ మహిళ అపస్మారక స్థితికి వెళ్లింది. స్థానికులు చూసి ఆస్పత్రిలో చేర్పించారు. రెండు రోజులకు ఆమెకు స్పృహ వచ్చింది. తనపై ఆటోడ్రైవర్ అత్యాచారం చేయబోయాడని చెప్పింది. ఆ ఆటోడ్రైవర్ పేరు కూడా చెప్పింది. వెంటనే పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఆ అటోడ్రైవర్ పేరు షేక్ మగ్ధూం. దాంతో మెల్లగా విషయం రాజకీయం అయిపోయింది. బీజేపీ నేతలు రంగంలోకి దిగారు. రాజాసింగ్ , బండి సంజయ్ వంటి వారు స్టేట్‌మెంట్లు ఇవ్వడంతో ఉద్రిక్త ప్రారంభమైంది. జైనూరులో ముస్లిం దుకాణాలపై దాడులు జరిగాయి. దీంతో కర్ఫ్యూ విధించాల్సి వచ్చింది. ఆదిలాబాద్ లో బీజేపీ మంచి పట్టు సాధించడానికి కారణం ఇలాంటి గొడవలు తరచూ జరుగుతూండటమే. ఇప్పుడు గిరిజన ప్రాంతాల నుంచి ముస్లింలను ఖాళీ చేయించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. బీఆర్ఎస్ ఈ ఘటనల్ని ప్రభుత్వ చేతకానితనంగా చెబుతోంది. హోంమంత్రి లేకపోవడం వల్లనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అంటున్నారు . మెల్లగా జైనూరు ఘటన విషయం జాతీయ మీడియాలోనూ హైలెట్ అవుతోంది. ఈ అంశం మరికొంత కాలం రాజకీయం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

# కొత్త పాసు పుస్తకాల సృష్టికర్తలెవరు..?

**- వారసత్వ భూమిని మార్చేశారు..**

**- తన భూమిపై అప్పటికే బ్యాంకులో అప్పు ఉంది**

**- పాస్ పుస్తకాలు బ్యాంకులో తాకట్టు పెట్టారు**

**- అక్రమార్కులపై విచారణ చేపట్టాలి**

**- తమ భూమిని పరిరక్షించాలని రైతు మల్లయ్య విజ్ఞప్తి**

పర్వతగిరి, సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త): పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన ఎర్రం మల్లయ్య అనే రైతు తన భూమి ఇతరుల పేరుపై మార్పిడి జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం విలేకర్ల సమక్షంలో ఆయన మాట్లాడుతూ తాను బ్రతికి ఉండగానే చనిపోయినట్లుగా, ఆయన అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఇతరులు తమ భూమిపై పట్టా పొందాలని వరంగల్ జిల్లా కలెక్టర్, స్థానిక తహశీల్దార్, ఎస్పైలకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలుపుతున్నారు. సర్వే నంబర్ 185/7/1 లో 1 ఎకరం 25 గుంటల వ్యవసాయ భూమి ఉందని మల్లయ్య చెబుతున్నారు. గతంలో వారు బ్యాంక్ లో తీసుకున్న క్రాఫ్ లోన్ ఇప్పటికీ రుణమాఫీ కాలేదన్నారు. ఇటీవల ప్రధాని మోడీ ప్రకటించిన రైతులకు ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం డబ్బులు అందరికీ వచ్చాయి. తనకు ఎందుకు రాలేదని మల్లయ్య బ్యాంకు అధికారులను, వ్యవసాయ అధికారులను సంప్రదించారు. తనపేరుపై భూమి లేదు, తనకున్న భూమిని ఎవరికో అమ్ముకుని తెలియనట్లుగా మాట్లాడుతున్నారు. బ్యాంకులో తీసుకున్న క్రాఫ్ లోన్ డబ్బులు కట్టాల్సిందేనని బ్యాంకు అధికారులు బ్యాంక్ అధికారు మాట్లాడారు. వేరే వారికి పీఎం కిసాన్ డబ్బులు పడ్డాయని వ్యవసాయ అధికారులు తెలపడంతో కంగుతిన్న రైతు మల్లయ్య రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అర్టీఐ చట్టం ద్వారా సమాచారం తెలుసుకున్న మల్లయ్య విలేకర్ల సమక్షంలో తమగోడు వెళ్ళబోసుకున్నారు. బాధిత రైతు తనకు వారసత్వంగా వస్తున్న వ్యవసాయ భూమిని తనకు తెలియకుండానే మార్పిడి చేసిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు తన భూమిని తనకు వర్తించేలా చేయాలని రోధిస్తున్నారు.



# రాయపర్తిలో దొంగల బీభత్సం




**- ఒకే రోజు రెండిళ్లలో చోరీకి పాల్పడ్డ దుండగులు - 50వేల రూపాయల నగదును, అర తులంబంగారం చోరీ**





రాయపర్తి, సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండల కేంద్రంలో దొంగలు బీభత్సం సృష్టించారు. గురువారం ఒకే రోజు రెండిళ్లలో చోరి జరిగిన ఘటన మండలకేంద్రంలో చర్చగా మారింది. స్థానికుల కథనం ప్రకారం గత 4, 5 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని అదునుగా తీసుకున్న దుండగులు ఇంట్లో ఎవరూ లేని సమయం, తాళం వేసి వున్న ఇళ్లను టార్గెట్ చేస్తున్నారు. దోపిడికి పాల్పడ్డ దుండగులు

రాయపర్తి గ్రామంలోని దాసరి రాంబాబు బీరువా తాలాలు పగలగొట్టి, 50 వేల రూపాయల నగదు, అర్ధ తులం బంగారాన్ని చోరీ చేసినట్లు చెబుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన రామాలయం వీధిలో ఉండే మొరుపోజు రవి ఇంట్లో చొరబడి రెండు బీరువాలు పగలగొట్టిన సంగతి మరువక ముందే మరో చోరి జరగడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రవి ఇంట్లో నగదు, బంగారం దొరకపోవడంతో దుండగులు ఇంట్లోని సామాగ్రిని చెల్లాచెదురు చేసి వెళ్లిపోయారు. జరిగిన ఘటనపై గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నట్లు చెబుతున్నారు. బాధితుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఇప్పటికైనా పోలీసులు ఇలాంటి దొంగతనాలు పునరావృతం కాకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.



# పింఛన్ల పంపిణీలో కీలక మార్పు దిశగా ఏపీ సర్కార్ అడుగులు

**అత్యాధునిక ఎల్ ఆర్‌డీ (రిజిస్టర్డ్) ఫింగర్‌ప్రింట్ స్కానర్ల కొనుగోలు**

**దీనికోసం గ్రామ, వార్డు సచివాలయ శాఖకు రూ. 53కోట్ల కేటాయింపు**

**అక్టోబర్ నుంచి 1.34లక్షల కొత్త స్కానర్లతో పింఛన్ల పంపిణీ**



విజయవాడ సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త): పింఛన్ల పంపిణీలో కీలక మార్పు దిశగా ఏపీలోని కూటమి సర్కార్ అడుగులేస్తోంది. ఈ మేరకు తాజాగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత కొంతకాలంగా సామాజిక పింఛన్ల పంపిణీలో జరుగుతున్న అవకతవకలకు ఆస్కారం లేకుండా సరికొత్త పద్ధతితో ముందుకు వస్తోంది. దీనిలో భాగంగా ప్రభుత్వం అత్యాధునిక ఎల్ ఆర్‌డీ (రిజిస్టర్డ్) ఫింగర్‌ప్రింట్ స్కానర్లను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీనికోసం రూ. 53కోట్లను గ్రామ, వార్డు సచివాలయ శాఖకు కేటాయించింది. దీంతో ఏపీ సర్వీసెస్ టెక్నాలజీ ద్వారా డివైజ్‌ల కొనుగోలుకు రాష్ట్ర సచివాలయాల శాఖ టెండర్లు ఆహ్వానించింది. అక్టోబర్ నుంచి 1.34లక్షల కొత్త స్కానర్లతో పింఛన్ల పంపిణీ జరగనుంది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న ఎల్ఓ ఆర్‌డీ స్కానర్లలో సెక్యూరిటీ పరంగా లోపాలు ఉన్నట్లు తెలుస్తోంది. దాంతో నకిలీ వేలి ముద్రలను ఉపయోగించి పింఛన్లు స్వాహా చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇక పింఛన్ల బదిలీ కోసం ప్రభుత్వం సంబంధిత వెబ్‌సైట్‌లో ప్రత్యేక ఆప్షన్‌ను తీసుకొచ్చింది. రాష్ట్రంలోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పింఛన్ బదిలీ కోసం దఖాస్తుదారులు గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లాల్సి ఉంటుంది. అక్కడ పింఛన్ ఐడీ, ఏ ప్రాంతానికి బదిలీ చేయాలనుకుంటున్నారో ఆ జిల్లా, మండలం, సచివాలయం వివరాలు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ ఇవ్వాలి. ఇలా చేయడం ద్వారా స్వగ్రామాలకు రాలేనివారు తాము ఉంటున్న ప్రాంతాల్లోనే పింఛన్ తీసుకునే వెసులుబాటు ఉంటుంది.

# మరమ్మతులకు తక్షణమే టెండర్లు

**వర్షాలకు దెబ్బతిన్న చెరువులు, కాల్వలు, ప్రాజెక్టులకు అత్యవసర మరమ్మతులు**

**1,800 లస్కర్ల నియామకానికి ఆర్థికశాఖ అనుమతి కోరండి: మంత్రి ఉత్తమ్**



హైదరాబాద్ సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త): భారీవర్షాలు, వరదలతో దెబ్బతిన్న చెరువుల కట్టలు, కాల్వలు, ఇతర ప్రాజెక్టుల పునరుద్ధరణకు తక్షణమే స్వల్పకాలిక టెండర్లు ఆహ్వానించాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.పనులకు పరిపాలనాపర అనుమతులను అత్యవసరంగా జారీ చేసి శుక్రవారం ఉదయం నాటికి ఆన్‌లైన్‌లో టెండర్లను పొందుపర్చాలని సూచించారు. దెబ్బతిన్న చెరువులు, కాల్వలు, ఇతర ప్రాజెక్టుల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం ఆయన జలసౌధ నుంచి క్షేత్రస్థాయిలోని నీటిపారుదల శాఖ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మొత్తంగా 544 జలవనరులకు నష్టం వాటిల్లిందని, అత్యవసర మరమ్మతులకు రూ.113 కోట్లు అవసరమని అధికారులు మంత్రికి నివేదించారు.అత్యవసర, శాశ్వత మరమ్మతులకు రూ.1,100 కోట్లు కేటాయించాలని కోరగా, రాష్ట్ర ఆర్థిక శాఖ రూ.350 కోట్లు కేటాయించిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నిధులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, తక్షణమే అన్ని పనులకు షార్ట్ టెండర్లు ఆహ్వానించాలని మంత్రి ఆదేశించారు. మళ్లీ భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మానవ తప్పిదంతో ఏదైనా నష్టం జరిగితే సంబంధిత చీఫ్ ఇంజనీర్లను బాధ్యులుగా చేస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వట్టెం పంప్‌హౌస్ పునరుద్ధరణ ఖర్చు నిర్మాణ సంస్థదే...: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలోని వట్టెం వద్ద నిర్మించిన పంప్‌హౌస్‌తోపాటు సొరంగం నీటమునగగా, 4000 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన 16 పంపుల ద్వారా నీళ్లను బయటకు తోడేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు మంత్రికి చెప్పారు. నిర్మాణ సంస్థే సొంతఖర్చుతో పునరుద్ధరణ పనులు నిర్వహిస్తుందని అధికారులు తెలిపారు.త్వరలో పదోన్నతులు, బదిలీలు..: విపత్తుల సమయంలో 90 శాతం మంది ఉద్యోగులు బాగా పనిచేశారని, మిగిలిన 10 శాతం మంది సైతం తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని మంత్రి సూచించారు. కొత్తగా నియామకం పొందిన 700 మంది ఏఈలకు త్వరలో పోస్టింగులతోపాటు నీటిపారుదల శాఖలో ఇంజనీర్లకు పదోన్నతులు, బదిలీలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. తాత్కాలిక పదోన్నతులు కాకుండా శాశ్వత పదోన్నతులే ఇస్తామన్నారు. నీటిపారుదలశాఖలో ఖాళీగా ఉన్న 1,800 లస్కర్ పోస్టుల భర్తీకి అనుమతి కోరుతూ ఆర్థికశాఖకు ప్రతిపాదనలను పంపించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఈఎన్‌సీ(జనరల్) అనిల్‌కుమార్, ఈఎన్‌సీ (ఓఅండ్ఎం) నాగేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# మరో మూడు రోజులు వానలు



హైదరాబాద్ సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త): :రాష్ట్రవ్యాప్తంగా మరో మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. వాయవ్య బంగాళాఖాతంలో గురువారం అల్పపీడనం ఏర్పడిందని, దానికి అనుబంధంగా ఉపరితల ద్రోణి కొనసాగుతోందని.. వీటి ప్రభావంతో విస్తారంగా వానలు కురుస్తాయని తెలిపింది. ఆరు జిల్లాలు ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో శుక్ర, శనివారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించింది.రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు, ముసురు వాతావరణంతో ఐదు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. భద్రాచలం, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో సాధారణం కంటే 3 డిగ్రీల మేర, మిగతా చోట్ల ఒకట్రెండు డిగ్రీల మేర తక్కువగా నమోదవుతున్నాయి. పలు ప్రాంతాల్లో రాత్రివేళల్లో చలిగాలులు వీస్తున్నాయి. గురువారం రాష్ట్రంలో అత్యధికంగా ఆదిలాబాద్‌లో 32.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.నైరుతి రుతుపవనాల సీజన్‌కు సంబంధించి వర్షాలు సాధారణాన్ని దాటిపోయాయి. సీజన్‌కు సంబంధించి ఇప్పటి (సెప్టెంబర్ 5)వరకు 60.32 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదవాల్సి ఉండగా.. 40శాతం అధికంగా 84.72 సెంటీమీటర్లు కురిసింది. వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో సాధారణం కంటే రెండింతలకుపైగా వర్షాలు కురిసినట్టు తెలంగాణ ప్రణాళిక విభాగం గణాంకాలు చెప్తున్నాయి. వనపర్తి జిల్లాలో 37.15 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతానికిగాను 79.14 సెంటీమీటర్లు, అంటే 114 శాతం అధికంగా వర్షం కురిసింది.

# అర్హత కలిగిన యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

**: తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారి**

**జనవరి 1 నాటికి పద్దెనిమిదేళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచన**

**అగస్ట్ 20న ప్రారంభమైన ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడి**

**అక్టోబర్ 29 నాటికి డ్రాఫ్టను ప్రకటిస్తామన్న ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి**



హైదరాబాద్ సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త): అర్హత కలిగిన యువత అంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. జనవరి 1 నాటికి పద్దెనిమిదేళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఆయన నేడు మాట్లాడుతూ... ఆగస్ట్ 20న ప్రారంభమైన ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అక్టోబర్ 29 నాటికి డ్రాఫ్టను ప్రకటిస్తామన్నారు. నవంబర్ 28 వరకు అభ్యంతరాలు స్వీకరించి, వచ్చే జనవరి 6న తుది జాబితాను ప్రచురిస్తామని వెల్లడించారు.రాష్ట్రంలో ఇప్పటి వరకు 3,33,27,304 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 8 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. వాటిలో 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వోలకు ఇప్పటికే శిక్షణ పూర్తయిందని తెలిపారు. అలాగే ఓటరు కార్డు, ఆధార్ లింక్ దాదాపు 60 శాతం పూర్తయినట్లు చెప్పారు.

# చంద్రబాబుకు తృటిలో తప్పిన ప్రమాదం



విజయవాడ సెప్టెంబర్ 5,(జర్నలిస్ట్ వార్త):


ముఖ్యమంత్రి చంద్రబాబుకు తృటిలో పెను ప్రమాదమే తప్పింది.. విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో విరామం లేకుండా పర్యటిస్తున్న చంద్రబాబు ఎప్పటికప్పుడు.. ఆయా ప్రాంతాల్లోని బాధితులను పరామర్శిస్తూ.. అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.. సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు..యితే, ఈ రోజు మధురానగర్ రైల్వే ట్రాక్ వద్ద సీఎం పర్యటన సందర్భంగా పెద్ద ప్రమాదమే తప్పింది.. వరద పరిస్థితిని చూసేందుకు రైల్వే ట్రాక్ దాటారు చంద్రబాబు . రైల్వే ట్రాక్ వద్ద ఉండగానే రైలు వచ్చేసింది.. ఇక, రైలును చూసి భద్రతా సిబ్బంది అప్రమత్తం కాగా.. రైల్వే ట్రాక్ అవతలి పక్కకు వెళ్లిపోయారు సీఎం . రెయిలింగ్ కు.. రైలుకు మధ్య ఉన్న చిన్నపాటి గ్యాపులోనే ఉండిపోయారు ముఖ్యమంత్రి.. ఇక, రైలు వెళ్లిన అనంతరం బయటకు వచ్చారు . మరోవైపు.. రైలు వెళ్లిపోయిన అనంతరం తన పర్యటనను కొనసాగించారు.

# ‘మల్లన్నసాగర్’పై ‘ఎన్జీటీ’ విచారణ

(మొదటి పేజి తరువాయి)

అనంతరం చెన్నైలోని ఎన్జీటీ సదరన్ జోన్ ధర్మాసనానికి కేసును బదిలీ చేసింది.గత నెల 7న విచారణ నిర్వహించిన చెన్నై ఎన్జీటీ ధర్మాసనం.. ‘మల్లన్నసాగర్’ను సందర్శించి నివేదిక సమర్పించాలని జిల్లా డిప్యూటీ కలెక్టర్, నీటిపారుదల శాఖను ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 11న నిర్వహించనుంది.గతేడాది సిక్కింలోని లోహ్నాక్ వాగుకు గండి పడడంతో తీస్తా నదికి ఆకస్మిక వరదలు పోటెత్తాయి. దీంతో చుంగ్తాంగ్ వద్ద తీస్తాపై నిర్మించిన 1,200 మెగావాట్ల హైడ్రో పవర్ ప్రాజెక్టు కమ్ డ్యామ్ కొట్టుకుపోగా, పలు మరణాలతోపాటు భారీనష్టం వాటిల్లింది. దీనిపై గతంలో ఎన్జీటీ–ఢిల్లీ సుమోటోగా విచారణకు స్వీకరించింది. మల్లన్నసాగర్ సైతం ఇదే తరహా అంశమని భావిస్తూ దానిపై సైతం విచారణ నిర్వహిస్తామని ఎన్జీటీ–ఢిల్లీ స్పష్టం చేసింది.భూకంపాల సంభావ్యతకు సంబంధించిన అధ్యయనాల్లేకుండా మల్లన్నసాగర్ నిర్మాణంతో ఏదైనా విపత్తు జరిగితే అమలు చేయాల్సిన అత్యవసర కార్యాచరణ ప్రణాళిక సైతం రూపొందించకపోవడం ద్వారా ప్రభుత్వం రిజర్వాయర్‌తోపాటు దిగువ ప్రాంతాల ప్రజల ప్రాణాలను ప్రమాదంలో నెట్టేసిందని కాగ్ ఆందోళన వ్యక్తం చేసిందని ఈ సందర్భంగా ఎన్జీటీ గుర్తు చేసింది.మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించడానికి ముందే సైట్‌లో భూకంపాలు సంభవించడానికి ఉన్న అవకాశాలపై ఎన్జీఆర్‌ఐతో అధ్య యనం జరిపించాలని షరతు విధిస్తూ ప్రాజెక్టు ప్రాథమిక డ్రాయింగ్స్‌ను 2016 ఆగస్టులో సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్ ఆమోదించారు.ఈ అధ్యయనాలు నిర్వహించాలని నీటిపారుదలశాఖ 2016 డిసెంబర్, ఆగస్టు 2017, అక్టోబర్ 2017లో హైదరాబాద్‌లోని ఎన్జీఆర్ఐ డైరెక్టర్‌కు లేఖలు రాసింది. అధ్యయన నివేదిక వచ్చే వరకు వేచిచూడకుండానే, 2017లో నీటిపారుదలశాఖ మల్లన్నసాగర్ నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించింది.మరోవైపు మల్లన్నసాగర్‌ను ప్రతిపాదించిన ప్రాంత భూగర్భంలో అత్యంత లోతు వరకు నిలువునా 3 జతల పగుళ్లు, వాటిలో కదలికలూ ఉన్నట్టు ఎన్‌జీఆర్ఐ 2017 మార్చిలో సమర్పించిన ప్రాథమిక నివేదికలో తేల్చి చెప్పిందని కాగ్ బయటపెట్టింది. వీటి ద్వారా ఉండనున్న ప్రభావంపై సమగ్ర సర్వే, పరిశోధనలు చేయా లని సిఫారసులు చేసింది. ఈ ప్రాంతానికి ఉన్న భూకంపాల చరిత్రను ఉటంకిస్తూ సమగ్ర అధ్యయనం జరిపించాలని కోరింది. ఈ సిఫారసులను రాష్ట్ర నీటిపారుదల శాఖ విస్మరించిందని కాగ్ ఆక్షేపణలు తెలిపింది.

# దేవర హైప్.. సరిపోదా?




సరిపోదా శనివారం సినిమా రిలీజ్ తో ఆగస్టు నెల పూర్తయింది. సెప్టెంబరు నెలలో దేవర ఒక్కటే పెద్ద సినిమా మిగతా చిన్నాచితకా సినిమాలు ఉన్నాయి కానీ దేవర మీదే అందరి ఫోకస్ ఉంది. ఇప్పటికే రిలీజ్ కావాల్సిన ఈ సినిమా వాయిదా పడి సెప్టెంబర్ 27వ తేదీకి వెళ్ళింది. అయితే ఈ సినిమా హైప్ అనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. నిజానికి కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా దేవర అనే సినిమా అనౌన్స్ చేశారు. కొరటాల ఆచారి లాంటి డిజాస్టర్ అందించి ఉండడం, జూనియర్ ఎన్టీఆర్ ఆర్ఆర్ఆర్ తర్వాత చేస్తున్న సినిమా కావడంతో ఈ సినిమా మీద సహజంగానే అందరి ఆసక్తి ఉంది. దానికి తగ్గట్టుగానే హీరోయిన్గా అతిలోకసుందరి అని తెలుగు వారంతా భావించే జాన్వీ కపూర్ ను దించడం, ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం అని చెప్పడం విలన్ గా, సైఫ్ అలీ ఖాన్ ను దింపడం లాంటివి సినిమా మీద ఉన్న ఆసక్తిని అమాంతంగా పెంచేశాయి. దానికి తగ్గట్టుగానే సినిమా నుంచి విడుదలైన రెండు పాటలు ఒక రేంజ్ లో ప్రేక్షకులకు ఎక్కేశాయి. మూడో పాట కోసం ఇప్పుడు కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. దానికి తగ్గట్టుగానే లిరిక్ రైటర్ రామజోగయ్య శాస్త్రి తనవంతుగా తాను హైప్ ఎక్కించే ప్రయత్నం చేస్తున్నాడు. మరొకపక్క మీడియాకి, సోషల్ మీడియా కి లీకులు ఇస్తూ సినిమా యూనిట్ కూడా సినిమా మీద హైప్ ఎక్కించే ప్రయత్నం చేస్తోంది. అయితే ఈ హైప్ ఎంతవరకు ఉపయోగపడు తుంది? అనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఎందుకంటే పెద్దగా హైప్ లేకుండా వచ్చిన సరిపోదా శనివారం సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంది. కొంత నెగిటివ్ టాక్ ఉన్నా సింహభాగం పాజిటివ్ టాక్ తో హిట్ ట్యాగ్ వేసుకొని దూసుకుపోతోంది. ఈ విషయంలో దర్శక నిర్మాతలు ఒక తెలివైన పని చేశారు.




## కంగనారనౌత్ ఎమర్జెన్సీ విడుదలపై నిషేధం?

బాలీవుడ్ నటి కంగనారనౌత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ప్రాజెక్ట్ ఎమర్జెన్సీ. దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాలనలో 1975 జూన్ 25 నుండి 1977 వరకు కొనసాగిన ఇండియన్ ఎమర్జెన్సీ ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. పొలిటికల్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో కంగనారనౌత్ ఇందిరాగాంధీ పాత్రలో నటిస్తోంది. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ చిత్రాన్ని ఎన్నికలకు ముందు వివాదాలకు అవకాశం ఇవ్వకుండా.. సెప్టెంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో తెలంగాణలో నిషేధం విధించే అవకాశాలున్నాయన్న వార్తలు తెరపైకి వస్తున్నాయి. ఎమర్జెన్సీ సినిమా రిలీజ్పై ప్రభుత్వం న్యాయపరమైన సంప్రదింపులు జరుపుతూ.. నిషేధం అంశాన్ని పరిలిస్తుందని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు. మాజీ ఐపీఎస్ అధికారి తేజ్ దీప్ కౌర్ మీనన్ నేతృత్వంలోని తెలంగాణ సిక్కు సొసైటీ ప్రతినిధుల బృందం షబ్బీర్ను కలిసి ఎమర్జెన్సీ విడుదలపై నిషేధం విధించాలని కోరింది. సిక్కు సొసైటీ ప్రతినిధులు సినిమాలో సిక్కు సమాజాన్ని చూపించిన తీరు పట్ల ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో.. రాష్ట్రంలో సినిమాను నిషేధించే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డిని షబ్బీర్ కోరినట్టు సమాచారం. ఎమర్జెన్సీ సమయంలో పౌరహక్కుల సస్పెన్షన్, ఇందిరా గాంధీ వ్యతిరేకుల అరెస్టుతోపాటు పలు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయని తెలిసిందే. ఎమర్జెన్సీ టైంలో ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా నిలబడ్డ ప్రముఖ రాజకీయ వేత్త జయప్రకాశ్ నారాయణ్ (జేపీ) పాత్రలో పాపులర్ బాలీవుడ్ దర్శకనిర్మాత అనుపమ్ ఖేర్ నటిస్తుండగా.. శ్రేయాస్ తల్పడే, భూమికా చావ్లా ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.



## ఈసారి అంతకు మించి అంటున్న అడివి శేష్

చాలా కాలంగా అడివి శేష్ తన రాబోయే పాన్ ఇండియా చిత్రం 'గూడాచారి 2' కోసం వార్తల్లో నిలుస్తున్నాడు. ఈ చిత్రం 2018లో వచ్చిన స్పై థ్రిల్లర్ చిత్రం 'గూడాచారి' కి సీక్వెల్. ఈ చిత్రంలో అడివి శేష్ తొలిసారిగా మధు శాలిని జంటగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రముఖ నటుడు ఇమ్రాన్ హష్మీ కూడా ప్రధాన పాత్రలో నటించనున్నారు. 'గూడాచారి 2' ని గ్రాండ్గా చేసేందుకు మేకర్స్100 కోట్ల భారీ బడ్జెట్తో చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రెండవ పార్ట్ బడ్జెట్ విషయానికి వస్తే రూ.100 కోట్లతో 'గూడాచారి 2' భారీ అంచనాలతో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా మొదటి భాగాన్ని 6 కోట్ల రూపాయలతో నిర్మించారు. బాక్సాఫీస్ వద్ద రూ.25 కోట్లకు పైగా బిజినెస్ చేసింది. ప్రస్తుతం 'గూడాచారి 2' షూటింగ్ కొనసాగుతోంది. ఇక ఈ చిత్రాన్ని మరింత గ్రాండ్గా చేయడానికి మేకర్స్ స్విట్జర్లాండ్ , పోలాండ్, ఇటలీ ఇలా మరికొన్ని యూరోపియన్ దేశాలలో చిత్రీకరించడానికి ప్లాన్ చేస్తున్నారు. 'గూడాచారి 2' చిత్రానికి వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వం వహించారు. టిజి విశ్వ ప్రసాద్, వివేక్ కూచిబొట్ల, అభిషేక్ అగర్వాల్ సినిమా నిర్మాతలు. ఈ సినిమా వచ్చే ఏడాది థియేటర్లలో విడుదల కానుంది. ప్రస్తుతానికి దీని విడుదల తేదీని వెల్లడించలేదు. ఈ సినిమా తెలుగుతో పాటు హిందీలో కూడా విడుదల కానుంది. దాని ప్రీక్వెల్ 'గూడాచారి' తెలుగులో మాత్రమే విడుదలైంది. ఆ తరువాత మేకర్స్ దానిని హిందీలో 'ఇంటిలిజెంట్ ఖిలాడీ'గా డబ్ చేసారు.

## ప్రభాస్ 'కల్కి 2' షూటింగ్ ప్రారంభమయ్యేది అప్పుడే.!

పాన్ ఇండియా నటుడు ప్రభాస్ కథానాయకుడిగా నాగ్అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన తాజా బ్లాక్ బస్టర్ 'కల్కి'. వైజయంతి మూవీస్ బ్యానర్లో వచ్చిన ఈ చిత్రం జూన్ 27న విడుదలై సూపర్హిట్ అందుకోవడమే కాకుండా.. ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.1300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి రికార్డులను సృష్టించింది. ఇదిలావుంటే ఈ సినిమాకు సీక్వెల్ ఉందని నాగ్ అశ్విన్ ప్రకటించిన విషయం తెలిసిందే. సీక్వెల్ను అయితే ప్రకటించారు కానీ ఎప్పుడు మొదలుపెట్టనున్నారు అనేది మాత్రం వెల్లడించలేదు. అయితే తాజాగా కల్కి 2 సినిమా షూటింగ్కు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్డేట్ను పంచుకున్నారు నిర్మాతలు స్వప్నదత్, ప్రియాంకదత్లు. వీరిద్దరూ.. మాస్కో ఇంటర్నేషనల్ ఫిల్మ్ వీక్లో పాల్గొని అక్కడి మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ క్రమంలోనే మూవీ అప్డేట్ను పంచుకున్నారు. ఈ మూవీ షూటింగ్ అప్డేట్పై నిర్మాత ప్రియంకా దత్ మాట్లాడుతూ.. కల్కి 2 షూటింగ్ మరో ఆరు నెలల్లో మొదలుపెట్టనున్నట్లు చెప్పారు. ఒక్కసారి మూవీ షూటింగ్ స్టార్ట్ అయితే వరుస అప్డేట్లను ఇస్తాం అని తెలిపారు.





## మునుపెన్నడూ పోషించని పాత్రలో రష్మిక!

'నేషనల్ క్రష్' రష్మిక మందన్న వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఈ ఏడాది చివరలో 'పుష్ప 2'తో శ్రీవల్లిగా తెరపై సందడి చేయనున్నారు. ఇక 'యానిమల్' సినిమాతో బాలీవుడ్లో భారీ హిట్ అందుకున్న రష్మిక.. ఆయుష్మాన్ ఖురానాతో జతకట్టనున్నారు. ఆదిత్య సర్పోత్దార్ తెరకెక్కిస్తున్న 'వాంపైర్స్ ఆఫ్ విజయ్నగర్' సినిమా చిత్రీకరణ అక్టోబరులో మొదలుకానుంది. హారర్ కామెడీ నేపథ్యంలో రూపొందనున్న ఈ సినిమాలో రష్మిక మునుపెన్నడూ పోషించని పాత్ర చేస్తున్నారని తెలుస్తోంది. 'వాంపైర్స్ ఆఫ్ విజయ్నగర్ షూటింగ్ త్వరలో ఆరంభం కానుంది. రెండు కాలల మధ్య తీర్చిదిద్దుతున్న భిన్నమైన కథ ఇది. ఈ సినిమా తొలి షెడ్యూల్ కోసం విజయనగర సామ్రాజ్యాన్ని తలపించేలా ఓ భారీ సెట్ను చిత్ర బృందం సిద్ధం చేస్తోంది. ఈ సినిమాతో రష్మిక మందన్న సరికొత్త ప్రయాణం ప్రారంభం కానుంది. ఇందులో మునుపెన్నడూ పోషించని పాత్రలో ఆమె కనిపిస్తారు. రష్మిక పాత్ర ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది. ఈ చిత్రం పెద్ద సక్సెస్ అవుతుంది' అని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.